

# కోరిక

## * కొండూరి భార్గవి *

శ్రీకాకుళం. రేకుల షెడ్ ఇల్లు. నాగవేణమ్మ పిచ్చుకపిల్లలా చలికి వణికి పోతూంది. ఊరు మేలుకోక ముందే నాగవేణమ్మ మేలుకుంటుంది. అలా లేవటం వయసు పైబడ్డప్పటి నుంచీ మరీ ఎక్కువైంది. దానికి తోడు చలి. నిద్దర పట్టదు. లేస్తూనే "నారాయణా, రామా!" అని నీరసంగా పిలుస్తూనే వుంది. రాత్రి పొద్దుపోయి రెండో ఆట సినిమాకి వెళ్ళిరావటంవల్ల అలసిపోయినవాళ్ళు ఆదమరచి నిద్రపోతున్నారు. మనవలు అంతే. వాళ్ళ పనులు వాళ్ళే తప్ప, నాయనమ్మ అంటే లెక్కలేదు. ఒకవేళ చదూకోవటానికి లేచినా ఆవిడని ఏది

పించటంలో వున్న ఆనందం కొత్తంత సేవచేయటంలో లేదు. రాణికి అత్తగారి పట్ల వున్న చులకన భావం ప్రతిబింబించి వుండవచ్చు.

అప్పుడే యింటిముందున్న వేప చెట్టుకు రాసుకుంటూ పాలవ్యాన్ వెళ్ళింది. నాగవేణమ్మ అప్పటినుంచి లేవటానికి ప్రయత్నిస్తోంది. మనవలు, కొడుకు కోడలుచేత మాటలు పడకుండా తన పనులు తానే చేసుకోవాలన్న తపన. వయసులో వున్నప్పుడు ఎవరినీ బాధించకుండా ఇంటెడు చాకిరీ చేసుకు ఇల్లు అద్దంలా పెట్టేది, ఎన్నో నోములు, వ్రతాలు, తలనిండా పూలు, బొట్టు కాటుకా పెట్టుకు, పసుపు రాసుకున్న పాదాలు, పట్టుచీరతో లక్ష్మీదేవిలా వుండేది. ఒకసారి గుడిసెలో వుండగా గోడ కట్టింది. పెంకు వేసింది. భర్త అండ కూడా అలాగే వుండేది. అన్ని పనులు స్వయంగా చేసుకునేది. అలాటిది కాలం మారింది. వయసు పెరిగింది. అందరికీ చులకనే. గౌరవం, ఆదరణ, ప్రేమ అంతా శూన్యం. ఏమన్నా అడిగితే ముసలిదానివి అంటారు.

తెలతెలవారింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ చేతికర్ర సహాయంతో పెరటి గుమ్మందాకా వెళ్ళింది. అప్పటికే ఇంట్లో అంతా కూడా విడిగా పనులు చేసుకుంటున్నారు. సమయంతో పాటే పరుగులు. ఉదయమనగా బయలుదేరి తిరిగి సాయంత్రం పక్షుల్లా గూటికి చేరటం. ఏం మాట్లాడుకున్నా రాత్రే. అదీ పది గంటల లోపునే.

"లేచావా! చంటీ" అని మనవరాలిని, "నాయనా! నారాయణా! నీ తల నెప్పి తగ్గిందా!" అని కొడుకుని. "అమ్మాయ్ రాణీ! డాక్టరిచ్చిన మందులు వేసుకున్నావా!" అని కోడలిని పలకరిస్తూ బావిగట్టువైపు వెళ్ళబోయింది.

"ఇలా కూచోవే అమ్మా! అసలే పాకుడు. ఆ కొత్త కాలుజారి పడ్డావంటే ఆసుపత్రి చుట్టూ తిరగలేక నేను చావాలి. అతని మాటలో ఆవిడ పడే బాధకన్నా అతను పడబోయే బాధే ఎక్కువగా వున్నట్టు అన్నాడు. నాగవేణమ్మ మాట్లాడకుండా కూచుని "అలాగేరా! మిమ్మల్ని బాధపెట్టకూడదనే నా ప్రయత్నం. కానీ, ఏం చేయను? కళ్ళు కనిపించటంలేదు. మోకాళ్ళ నెప్పి, నీరసం- కర్ర పక్కనపెట్టి చెబుతూనే వుంది. అంతలో బియ్యం కడుక్కోవాలని వచ్చిన రాణీ-కోపంగా చూస్తూ- "అయిందీ. తెల్లవారింది. ఇక ఈవిడ గారి రోగాల లిస్ట్ వల్లించడానికి. అక్కడికి ఈవిడొక్కతే ముసలావిడ. ఈవిడికే అన్ని బాధలు ప్రపంచంలో ఎవరికీ లేనట్టు వేషాలు" అంది గట్టిగా. నాగవేణమ్మ మనసు చివుక్కుమంది. అత్త కనక తనని చులకనగా తీసిపారేస్తోంది. రెండు రోజుల క్రితం వచ్చిన తన

పిన్నివి ఎంత ఆప్యాయంగా బాధలు కనుక్కొని కీళ్ళనొప్పి అవగానే ఆసుపత్రికి తీసుకెళ్ళింది. ఆవిడ కిష్టమయినవి వేడిగా వండిపెట్టింది. కానీ! తల్లి లేనిదని మేనకోడలిని కోడలిగా తెచ్చుకున్నందుకు మిగిలించిందేమిటి. తిట్లు, శాపనార్థాలు. కనీసం సమయానికి రెండు ముద్దల అన్నమయినా పిలిచి ఆప్యాయంగా పెట్టే దిక్కులేదు. నెమ్మదిగా పళ్ళు తోముకుంటూంది.

మళ్ళీ ఆలోచనలు. పురుళ్ళు పోసింది. వెట్టిచాకిరీ చేసింది ఆ విషయం రాణికి గుర్తున్నట్టు లేదు. బాగున్నంతకాలం పనికి వచ్చింది. ఈరోజు తన ముఖం చూస్తేనే విసుగు, హేళన.

"ఏంటే! అమ్మా! పళ్ళు కడుగుతున్నావా! పడుకున్నావా!" నారాయణ విసుగు. బకెట్టులో నీళ్ళు ముంచుకుపోయింది పాకుడుకి హఠాత్తుగా జారి పడటంతో చేయి గీరుకుంది.

"నారాయణా! నారాయణా!" లేవటానికి ప్రయత్నిస్తూ పిలుస్తూనే వుంది.

పిల్లలు నవ్వుకుంటూ ముందునుంచే వెళ్ళిపోయారు. అంతలో నారాయణ వేగంగా ఇంట్లోకి వెళ్ళినవాడు కాస్త వచ్చి, "అయిందీ! పడ్డావా! ఇక నా కష్టాలు నాకున్నాయన్నమాట" లేవనెత్తాడు.

"నిన్ను కష్టపెట్టకూడదనుకుంటూనే కష్టాల పాలయ్యానురా!" అంది బాధగా. రాణి అప్పటికే వెళ్ళటానికి సిద్ధమవుతూ —"అయిందీ! ఇప్పటికే మీకు సేవలు చెయ్యలేక మా ప్రాణాలు పోతున్నాయి. మళ్ళీ ఇదొకటా!" అంది విసుగ్గా. నారాయణ విసుక్కుంటున్న భార్యవైపు చూసి, నాలుగు మెతుకులు తిని "ఒక ప్రక్క కూచోక మమ్మల్నెందుకు బాధపెడతావే! పాపం రాణికి ఇంట, బయట చాకిరీ చేయలేక ఎంత కష్టమవుతుందో నీకేం తెలుసు" అంటూ బాధపడుతూన్న తల్లిపైకన్నా, భార్యపట్ల జాలి కురిపించాడు.

"టేబిల్ మీద అన్నీ సర్దిపెట్టాను. పెట్టుకు తినండి" అంటూ వెళ్ళిపోయింది

ఆ తర్వాత కాసేపటికి నారాయణ పిల్లలు కూడా వెళ్ళిపోయారు.

బిక్కుబిక్కుమంటూ ఇంట్లో మిగిలింది ఒక్క నాగవేణమ్మ. ఎలాగో స్నానం పూజ ముగించుకుంది. కాసేపు చిన్న చిన్న పనులు చేసింది. అంతలో భోజనానికి పిల్లలు వచ్చారు. వాళ్ళు తిన్న తర్వాత తిందామనుకుంది. ఆ తర్వాత వెళ్ళి చూస్తే ఎంగిళ్ళు, అడుగుబొడుగు. వాళ్ళ కెన్నిసార్లు శుభ్రత, ఎంగిళ్ళు గురించి నీతులు చెప్పినా వినిపించుకోరు. దేవుడికి ఆరగింపు చేసిన అరటిపండు తిని వెళ్ళి పడుకుంది.

అందరూ బయటకు వెళితే ఇంట్లో చేసేవారు పట్టించుకునేవారు లేకపోతే ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఎప్పుడూ చిందరవందరగా వుండే ఇల్లు-

క్రమశిక్షణలేని పిల్లలు నాగవేణమ్మకు ఎంతో బాధగా వుంటుంది.

సాయంత్రం వచ్చాక రాణీ ఆప్యాయంగా పలకరిస్తుందనుకున్నది. కానీ! రాణీ భర్తకు పిల్లలకు టిఫిన్, కాఫీ చేసి పెట్టి సరదాగా కబుర్లు చెబుతూంది. మధ్యలో నాగవేణమ్మకు కూడా తెచ్చి పెట్టింది. రాత్రి, పగలు, కుడి ఎడమ అని ఎంచకుండా చాకిరీచేసిన అత్తగారి మనోవ్యథ గ్రహించే ఓపిక, తీరిక లేవు కదా! అంతలో నారాయణ "అమ్మా! రాణీ పకోడీలు బాగా చేసిందే! తిను, అయినా ఎంతసేపూ విచారంగా ఏం ఆలోచిస్తావు. సర్దుకుపోవాలి! కలిసి నవ్వాలి" అన్నాడు. నాగవేణి అతని వేపు బాధగా చూసి- పిచ్చినాగన్న, భార్యకు, తల్లికి ఎదురుచెప్పలేడు అనుకుంది.

ఎన్నాళ్లగానో, బంగాళదుంప వేపుడు చారు తినాలని కోరిక. భయంగానే రాణీని సాయంత్రంవేళ అడిగింది. "ఇది మరీ బావుంది. మనిషికో రకం చేయటానికి నాకు తీరిక, ఓపిక లేవు. తింటే తినండి లేకపోతే లేదు. నాకు కొచింరి చేస్తానంటే" అంది కఠినంగా.

నారాయణ అటు భార్యకు చెప్పలేక "అమ్మా! నేను చేసిపెడతాను లేవే!" అన్నాడు. తాను తప్ప మరో దిక్కులేని నాగవేణమ్మని చూస్తే విసుగు రాణీకి. నాగవేణమ్మ చిన్నబుచ్చుకుంది. బాధపడటం తప్ప ఏం చేయలేని కొడుకు ప్రేమ ఆదరాలు కరువై పోతున్నాయి. మానసికంగా నాగవేణమ్మ కృంగిపోసాగింది. ఎందుకు బ్రతుకుతుందో తెలియని పరిస్థితి. ఇంట్లో అంతా పెళ్ళికి వెళ్లారు. మనవడు టీవి పెట్టాడు కళ్ళు చికిలించి చూస్తూంది. మనవడు "నానమ్మా! ఆ ముసలాళ్ళ కోసమే మేము డబ్బులు జమ చేసాం!" అన్నాడు ఆనందంగా. ఎవరి పనులు వాళ్లే చేసుకునేవాళ్ళని చూస్తే ఆశ్చర్యంగా వుంది. "దానిని ఏమంటారు నాయనా!" అంది సందేహంగా. "'హోమ్ ఫర్ ది ఏజ్డ్' ముసలాళ్ళుండే ఇల్లు" అన్నాడు. మర్నాడు నెమ్మదిగా నారాయణను దగ్గరకు పిలిచి "నారాయణా ఇంక నిన్నేమీ అడగను గానీ నన్ను ముసలాళ్ళు వుండే ప్రదేశం అదే మనవడు చెబుతాడు దానిలో చేర్పించరా!" అంది. నారాయణ ఆశ్చర్యంగా "మేముండగా నీకేం కర్మ అమ్మా!" అన్నాడు.

"అంతా వున్నా ఎలాగూ ఒంటరితనాన్నే అనుభవిస్తున్నా! ఎలాగయినా చేర్పించరా! బాబూ!" అంది బ్రతిమాలుతూ.

క్షణం ఆలోచించిన నారాయణ తల్లి వైపు జాలిగా కన్నీళ్ళతో చూసాడు.

• • •